# బహుమతి

వట్టి హడావుడి మనిషి సదానందం!

సంక్షిప్తంగా వాడినిగురించి చెప్పాలి అంటే...

మెంటల్ షాక్ తట్టుకోలేని దుర్బలుడు!

ఆత్మవిశ్వాసం లేని వ్యక్తి!! –

స్వతహాగ కొంచెం సెల్ఫు వాయించుకుంటాడు!! –

ఇన్‌కంటాక్సు లేని వాడివృత్తి...కాదు...'హాబీ'

దినదినాభివృద్ధి చెందుతున్న రోజులు...

ఒకరోజు! –

ఊరంతా హడావుడిగా వుంది.

ఎక్కడ చూసినా రోడ్లమీద సదానందమే అవుపిస్తున్నాడు. అనర్గళమైన వాడి కంఠ ధ్వనే విన్పిస్తోంది.

ఎలక్షన్ల సందడేమో అనుకున్నారు కొందరు. విషయం తెలిసినవాళ్ళు 'సదానందం ఇంకా ఎట్లా బ్రతికున్నాడుస్మీ!' అనేసి ఆశ్చర్యపడుతున్నారు.

"నీకు కథల పోటీల్లో ప్రైజొచ్చినట్టు తెలిస్తే సడన్‌గా హార్టు ఫేలవుతుందిగా..." అనేసి క్రితంరోజు ఫ్రెండ్ జోక్ చేశాడు.

తనకే ఫస్టు ప్రైజు రావాలనీ, వస్తే, సమస్త దేవుళ్ళకూ పూజలు జరిపించవచ్చనీ మనసులో ఆరాటపడ్తున్నా, పైకి మాత్రం...'మనకెందుకొస్తుందోయ్' అనేవాడు. (ఎంచేతంటే ఏ పనైతే జరుగదని పైకి చెప్పుకుంటే అది తప్పక నెరవేరుతుందని పిచ్చినమ్మకం.)

ఇంతకూ సంగతేమిటంటే...కథల పోటీల్లో ఫస్టు ప్రైజొచ్చిందని టెలిగ్రాం వచ్చింది. సదానందం సంతోషం పట్టలేక చచ్చినంతపనైంది. పది నిమిషాలపాటు నోటమాట రాలేదు - ఓ వేళ ఖర్మగాలి ప్రాణమేమైనా పోయిందేమోనని ఇంట్లో వారంతా కంగారు పడ్డారు.

'షాక్' నుండి తెప్పరిల్లుకున్న సదానందం పెద్దపెట్టున నవ్వేశాడు, పిచ్చిగా అందరికేసి చూశాడు. ఫ్టైజు ఆహ్లాదం ముఖంలో ఉట్టిపడ్డది...క్రితం రోజు 'ఎడ్వాన్సు'గా ఆంజనేయస్వామికి సమర్పించుకున్న కొబ్బరికాయ లంచం తాలూకూ ప్రతిఫలంగా తనకీ సాయం జరిగిందని మురిసిపోయాడు.

పూర్తిగా తెల్లవారనైనాలేదు.

ఓ రిక్షాలో ప్రతి స్నేహితుని ఇంటికీ వెళ్ళి నిద్రలేపి విషయం దండోరా వేశాడు.

ఎలక్షలో గెల్చిన యం. ఎల్. ఏ. లాగ హుందాగ రోడ్డుమీద నడవసాగేడు.

పాతికరూపాలు ఖర్చుచేసి ఐనవారినీ కాని వారినీ అందరినీ కూడదీసి ఖుషీగ పార్టీ యిచ్చాడు.

అందరిచేత 'ఆహా...ఓహో' అనిపించుకుంటుంటే సదానందం ప్రాణం ఇహంలోనుండి పరంలోకి ప్రయాణం చేయసాగింది.

సాయంత్రం స్టూడియోకెళ్ళి ప్రొఫైల్‌లో పాస్‌పోర్టు సైజు ఫోటో తీయించాడు.

ఫోటోతోబాటు వివరాలు, జీవిత విశేషాలు, జత పర్చి పత్రికాధిపతులకు పోస్టుచేశాడు.

సదానందం ఆశయం, ఆకాంక్ష నెరవేరినందుకు ఫ్రండ్సంతాకలిసి టౌన్‌హాల్లో సన్మానసభ ఏర్పాటుచేశారు.

గరల్ ఫ్రెండ్సెందరో పరిచయమయ్యారు. అసలు ఆడస్నేహితులకోసమే కథలు వ్రాయటం ఆరంభించిన సదానందం తనకు ప్రైజు రావటంతో ఆశ సఫలీకృతమైంది! తన పేరు ప్రతిష్ఠలు ద్విగుణీకృతమైనయి!

ఇరవైనాలుగంటల్లో సదానందం పరపతి తిరపతిదేవుడి కంటే వెయ్యింతలైంది. అంతకింతై ఇంతకెంతవుతుందోనని ఎవ్వరూ ఊహించలేకపోతున్నారు.

రాత్రి తొమ్మిది గంటలవుతోంది.

టౌన్ హాలుముందు 'స్వాగతం' బోర్డు గాలికి ఊగులాడుతోంది. రంగురంగుల తోరణాలు సదానందం ఆనందాన్ని పాలు పంచుకుంటున్నట్లు రెపరెప లాడుతున్నాయి. విద్యుత్ దీపాల కాంతిలో టౌన్‌హాలు ఆవరణ భూతల స్వర్గంలా మెరిసిపోతూంది.

సదానందం సన్మాన వేదిక అలంకరించేసరికి కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. ఆనందంతో వుబ్బిపోతూ మన సులో 'అబ్బా!...అబ్బా!' అనుకున్నాడు.

మెళ్ళో పూలమాల తీసి వినయంగా టేబిలుమీద వుంచి. ఛాతి విరుచుకుని కుర్చీనిండా కూర్చున్నాడు 'బలపం' లా వున్న సదానందం.

శ్రీ సదానందం వ్రాసిన కథలు ఆరు. (ప్రైజొచ్చింది గనుక పేరుకు ముందు శ్రీ చేర్చటం సాంప్రదాయం.) అందులో రెండు కథలు లోగడ ఎప్పుడో పత్రికల్లో ప్రచురించ బడ్డయ్. మూడు తిరుగొచ్చాయి. ఆరో కథకు ప్రైజొచ్చింది.

మైక్ ముందుకొచ్చి నిల్చున్న సదానందం అసలు మాట్లాడలేక పోతానేమోనని భయపడిన వాడల్లా అరగంట సేపు అనర్గళంగా లెక్చర్ దంచేశాడు.

కథలెట్లా వ్రాయాలో తెలీకపోయినా (ఖర్మ! ప్రైజొచ్చింది గనుక...) పదివేల కథలు వ్రాసిపారేసిన ఘనాపాఠీ రచయితకుమల్లే స్పీచ్ దంచేశాడు—తనకుమల్లేనే ఇంకా ఎందరో రచయితలు గొప్ప కథలను నవలోకానికి అందివ్వాలనీ తద్వారా సమాజం అభివృద్ధి చెందాలనీ, దేశాన్ని బాగుచేయగలిగిన వాడల్లా ఒక్క రచయితేననీ...యింకా ఏవేవో అర్థంగాని పెద్ద పెద్ద మాటలతో 'స్పీడ్' ముగించాడు.

సవ్యంగా, దివ్యంగా ముగిసింది సభ.

ఇహ...ప్రైజ్ తాలూకు డబ్బు ఎప్పుడెప్పుడొస్తుందాఅని వెయ్యి కళ్ళతో, కోటి ఆలోచనల్తో ఎదురు చూస్తున్నాడు.

పోస్టాఫీసుదాకా వెళ్ళి పోస్టుమాన్‌ని పరామర్శించి వస్తున్నాడు ప్రతిరోజూ.

ఒకరోజు భోజనం పూర్తిచేసి ఈజీచైర్లో నడుం వాల్చాడు సదానందం. ఆఫీసు కెళ్ళబోయే ప్రయత్నంలో వున్నాడు.

పోస్టుమాన్ పిలుపుకు త్రుళ్ళిపడ్డాడు.

అతని చేతిలో కవరును అమాంతం గుంజుకుని పీదప ముద్దెట్టుకున్నాడు.

ప్రైజు తాలూకు ప్రతిఫలం చెక్కు ద్వారా పంపి వుంటారని సంబరపడుతూ కవరు విప్పేడు.

"ఆర్యా!

పోటీ తాలూకు ఫస్టు ప్రైజు టెలిగ్రాం శ్రీ చిదానందంగారికి పంపవలసినది; మీ కిథ పేరు, మీ పేరూ, అదే కావటంవల్ల పొరపాటున మీకు ఇవ్వటం జరిగింది. మీ ఫొటో తిప్పి పంపుతున్నాం.

పొరపాటుకు చింతిస్తున్నాం.

సం||

సంపాదకుడు."

ఉత్తరం చదివేసరికి శ్రీశ్రీశ్రీ సదానందం గుండె కాయ జారి నేలమీద పడి దారితప్పి జనరల్ హాస్పిటల్లో, క్యాజువాలిటీ శాఖలో చేర్చబడ్డది!